హైదరాబాద్‌లోని తన నివాసంలో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన కవిత. చిత్రంలో విద్యాసాగర్‌రావు, గట్టు రామచంద్రరావు తదితరులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
- 11 నెలల్లోనే ఇంత ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న సర్కారు ఇదే
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం
- నేడు కులగణన కమిషన్‌కు నివేదిక

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ఈ స్థాయిలో ప్రజావ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం దేశ చరిత్రలోనే ఎక్కడా లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీఆర్ఎస్ ప్రారంభించిన ఏ ఒక్క పనిని, పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతున్నదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్‌లు, సోషల్ మీడియాను సిద్ధం చేసుకోవాలని కేసీఆర్ హయంలో ఎలా ఉన్నది? ప్రస్తుతం ఎలా ఉన్నది? అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉన్నదని కార్యకర్తలకు సూచించారు. కరెంటు కోతలు, రైతుభరోసా, మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వకుండా ఎలా మోసం చేసారనే అంశాలను ఇప్పటి నుంచే చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, పార్టీ నుంచి కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత భరోసానిచ్చారు. జగిత్యాలలో ఎమ్మెల్యే పార్టీ మారిన అంశంతో సంబంధం లేకుండా నియోజకవర్గంలోని గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో జగిత్యాలలో మెజారిటీ సీట్లు గెలిచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

నేతలు మారినా.. కార్యకర్తలు పార్టీతోనే

ప్రస్తుతం పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ని గతంలో ప్రతి పార్టీ కార్యక్రమంలో వేదికపైకి తీసుకొచ్చి కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదేండ్ల పాటు ప్రతి గ్రామంలో తాను పరిచయం చేసిన విషయాన్ని కవిత గుర్తుచేశారు. ఓడినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టంచేశారు. నాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డి ఎన్ని అకృత్యాలు చేసినా బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడ బట్టే, గులాబీ జెండా ఎగిరిందని తెలిపారు. నేతలు పార్టీ మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారనేందుకు మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గమని చెప్పారు. 'గులాబీజెండా అంటేనే గుండె ధైర్యం' అని తేల్చిచెప్పారు. 'నీ కోసం తపించిన బిడ్డ కష్టాల్లో ఉండి జైల్లో ఉన్నప్పుడు దుర్మార్గానికి ఒడిగడతవా?' అని ఎమ్మెల్యే సంజయ్‌పై మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మండిపడ్డారు. రాజకీయాలకు సంజయ్ మచ్చ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కులగణన కమిషన్‌కు నివేదిక

బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన కవిత, కులగణనపై చర్చించారు. సోమవారం ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు ఆమె రిపోర్ట్ అందజేయనున్నారు. సమావేశాల్లో జగిత్యాల జడ్పీ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేశ్, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్‌రావు, బొల్లా శివశంకర్, ఆలకుంట హరి, ఉపేందర్, మఠం భిక్షపతి, రాజారాం యాదవ్, దావ సురేశ్ పాల్గొన్నారు.

అబద్ధాల్లో రేవంత్‌కు డాక్టరేట్

- ఒట్లు వేసి దేవుళ్లనే మోసం చేసిన సీఎం
- రేవంత్ ప్రచారం వల్లే 'మహా' ఓటమి
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ
- కాళేశ్వరంపై రేవంత్ అబద్ధపు ప్రచారం
- ఫార్మాసిటీపై రేవంత్ మాట మార్పు
- దళితబంధు నిధులు విడుదల చేయాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, హరీశ్‌రావు. చిత్రంలో కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తదితరులు

హుజూరాబాద్/హుజూరాబాద్ టౌన్, నవంబర్ 24: అబద్ధాలు ఆడటంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీహెచ్‌డీతో పాటు డాక్టరేట్ ఇవ్వొచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప నిజాలు రావడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అక్కడ రేవంత్, తెలంగాణ మంత్రుల ప్రచారం వల్లే కాంగ్రెస్ ఓడిందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసగించిన విషయాన్ని మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని చెప్పారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఒట్టేసి దేవుళ్లను కూడా రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. దేవుళ్లనే మోసం చేసిన రేవంత్‌కు ప్రజలను మోసం చేయడం పెద్ద పనేమీ కాదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిపోయిందని, ఎక్కడ చూసినా అరాచకమే కనిపిస్తున్నదని ఆరోపించారు. తాము కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలమైందని, అది చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం కూలిపోయిందని అపవాదు వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోతే హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేందుకు అవసరమయ్యే 20 టీఎంసీలను కాళేశ్వరం నుంచి తరలించేందుకు టెండర్లు పిలవాలని సీఎం ఎలా చెప్పారని, మూసీ నదిలోనూ 5 టీఎంసీలు కలుపుతామని ఎలా అన్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని సీఎం అంటుంటే, మంత్రులు మాత్రం గడిచిన పదేండ్లలో తెలంగాణలో అత్యధిక వ్యవసాయ ఉత్పత్తులు జరిగాయని చెప్తున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ చూస్తుంటే కాళేశ్వరంపై సీఎం కావాలనే అభాండాలు వేస్తున్నారని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు.

మోసం చేసి వారోత్సవాలా?

రైతులకు ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, రైతులను అన్ని విధాలా మోసం చేసిన ప్రభుత్వం వారోత్సవాలు ఎలా నిర్వహిస్తున్నదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఇలాకాలోనే రైతులు పోరాడుతున్న విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. 19 జూలై 2024న ఫార్మాసిటీ కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అని ఎలా చెప్తారని ప్రశ్నించారు. తాము సేకరించబోయే భూముల్లో తొండలు కూడా గుడ్లు పెట్టవని సీఎం చెప్తుంటే, రైతులు మాత్రం అక్కడ పచ్చని పంట పొలాలను చూపిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫార్మా క్లస్టర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పత్తికి మద్దతు ధర రూ. 7,500 ఉంటే రూ. 6,500 మాత్రమే ఇస్తున్నారని, వడ్లను రూ. 1600–1700కే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ బోగస్ అయిందని మండిపడ్డారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసిన దళితబంధు పథకం ద్వారా ఎంతోమంది దళితులు ఉన్నతస్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. రెండో విడత దళితబంధు నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు కోసం హుజూరాబాద్‌లో ధర్నాకు దిగిన దళిత కుటుంబాలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. దళితబంధు నిధుల విడుదలపై మంత్రి భట్టివిక్రమార్క బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18 డిమాండ్లతో నేడు బీసీ రణభేరి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం బీసీ రణభేరి మహాసభ నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 డిమాండ్లతో నిర్వహించే ఈ సభకు అన్నిపార్టీల నేతలను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. కేంద్రం చేపట్టబోయే జనగణనలో కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్‌చేశారు.

యూకే బీఆర్ఎస్ ఎన్నారై అధ్యక్షుడిగా నవీన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): యునైటెడ్ కింగ్‌డమ్ బీఆర్ఎస్ ఎన్నారై నూతన అధ్యక్షుడిగా నవీన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు బీఆర్ఎస్ ఎన్నారై వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, కోఆర్డినేటర్ మహేశ్ బిగాల సంయుక్తంగా ప్రకటించారు. 14ఏండ్లుగా తెలంగాణ ఉద్యమంతోపాటు బంగారు తెలంగాణ నిర్మాణంలో క్రియాశీల పాత్ర, ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషిస్తున్నామని మహేశ్ బిగాల పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా హరి నవాపేట్, సతీశ్‌రెడ్డి, సత్యమూర్తి, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా రత్నాకర్ కడుదుల, అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా చంద్రశేఖర్ గౌడ్, వైస్ చైర్మన్లుగా శ్రీకాంత్ జెల్ల, గణేశ్ కుప్పాల, యూకెసెల్ అధికార ప్రతినిధిగా సాయిబాబాతోపాటు సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

సీఎం సోదరులపై పీడీ యాక్ట్ పెట్టాలి

సాయిరెడ్డి సూసైడ్‌పై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం • బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్పీ • సాయిరెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ

కల్వకుర్తి, నవంబర్ 24 : కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి మృతి కేసులో సీఎం సోదరులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సాయిరెడ్డి సూసైడ్‌నోట్ పక్కనబెట్టి సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై ఈగ వాలకుండా కొమ్ముకాస్తున్న పోలీసులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖాన మార్చురీలో సాయిరెడ్డి భౌతిక కాయం వద్ద ఆదివారం ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం దవాఖానలో ఆవరణలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం సోదరుల తీరుతో అవమానభారానికి గురై సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో నిందితుల కాలం ఖాళీగా ఉంచి 108 బీఎన్ఎస్ సెక్షన్ ఊసే లేకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉన్నదని అన్నారు. మరణ వాంగ్మూలం నోట్‌ను పోలీసులు మాయం చేసి.. బీఎన్ఎస్ 108 సెక్షన్‌ను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోట్ తమ వద్ద లేదని బుకాయిస్తున్న పోలీసులు సోషల్ మీడియాలో కనిపిస్తున్న లేఖ ఆధారంగా కేసు నమోదు చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా? అని నిలదీశారు. అవసరమైతే సీఎం సోదరులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నోటీసులు

అనుమతి లేకుండా ధర్నాపై వివరణ కోసం..

హుజూరాబాద్, నవంబర్ 24: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఆదివారం పట్టణ పోలీసులు నోటీసులు జారీ చేశారు. దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 9న పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టగా, ఎమ్మెల్యే హాజరై మద్దతు ప్రకటించారు. అనుమతి లేకుండా ధర్నా చేపట్టారని 35(3) బీఎన్ఎస్ కింద ఎమ్మెల్యేకు ఎస్సై యూనిస్ నోటీసులు అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు బాధితులపై కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. ఈ విషయమై సీఐని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.

కేసీఆర్ హయాంలో పర్యావరణానికి పెద్దపీట

- రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు భేష్
- తెలంగాణ కూల్ రూఫ్ పాలసీ దేశానికే ఆదర్శం
- చిత్రకూట్ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో వక్తల ప్రశంసలు

మధ్యప్రదేశ్ చిత్రకూట్‌లో జరిగిన సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విశేష కృషి జరిగిందని అంతర్జాతీయ సదస్సు ప్రశంసించింది. మధ్య ప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో ఆదివారం ఈ సదస్సును నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వక్తలు ప్రసంగిస్తూ.. భూతాపాన్ని, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించేందుకు గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన చొరవను కొనియాడారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుతోపాటు పలు ఇతర కార్యక్రమాల ద్వారా విద్యుత్తు వినియోగాన్ని తగ్గించడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో ఒప్పందాలు కుదుర్చుకుని జీహెచ్ఎంసీ పరిధిలో 5.48 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేయడం వల్ల 236.19 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా అవడంతోపాటు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు గణనీయంగా తగ్గినట్టు తెలిపారు. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)ను అమలు చేయడంలో గత ప్రభుత్వం చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో ఈసీబీసీని మున్సిపల్ చట్టంలో విలీనం చేశారని కొనియాడారు.

కూల్ రూఫ్ పాలసీకి ప్రశంసలు

నగరాలు, పట్టణాల్లో ఉష్ణ ప్రభావాన్ని తగ్గించేందుకు, ఇంధన సంరక్షణకు కూల్ రూఫ్ పాలసీని తీసుకురావడం బీఆర్ఎస్ ప్రభుత్వ దూరదృష్టిని ప్రతిబింబిస్తున్నదని కొనియాడుతూ.. దేశంలోని అన్ని నగరాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పర్యావరణ లక్ష్యాలను సాధించడం ద్వారా భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు బీఆర్ఎస్ సర్కారు చేసిన కృషి అనిర్వచనీయని శ్లాఘించారు. పర్యావరణ పరిరక్షణకు తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలు పెద్దపీట వేశాయని గుర్తు చేశారు.

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు

నియంతలా మా ఎమ్మెల్యే!

ఎల్లారెడ్డి శాసనసభ్యుడిపై పీసీసీ చీఫ్‌కు నాయకుల ఫిర్యాదు

రామారెడ్డి, నవంబర్ 24: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి. సొంత పార్టీ నేతల మధ్య వైరం నడుస్తున్నది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వ్యవహార శైలితో విసిగిపోయిన నాయకులు పార్టీ అధిష్ఠానాన్ని ఆశ్రయించారు. నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, నారెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శనివారం రాత్రి గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఎమ్మెల్యే తీరుపై ఫిర్యాదు చేశారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపులేదని, వలస వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుంటే కనీసం ఖండించడం లేదని అన్నారు. స్థానికంగా ఉండటం లేదని, ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇందిరాగాంధీ జయంతి కూడా నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయకుండా అవమానపరుస్తూ నియంతలా వ్యవరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే తన వ్యక్తిగత సిబ్బందితో నాయకులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విదేశాలకు వెళ్తూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులతో కాకుండా వ్యక్తిగత సిబ్బందితో పంపిణీ చేయిస్తూ తమను అవమాన పరుస్తున్నారని తెలిపారు. 20 ఏండ్ల నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించడంలేదని, ఎదురు మాట్లాడితే ఎమ్మెల్యే వర్గీయులు గూండాగిరి చేస్తూ దూషిస్తూ, దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. నియోజక వర్గంలో కనీసం ప్రొటోకాల్ పాటించకుండా ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

వైద్యం..అస్తవ్యస్తం!

సరిపడా మందుల సరఫరాలో నిర్లక్ష్యం • నీళ్లు లేక ఆగిపోయిన సర్జరీలు

ఉద్యోగుల బదిలీల్లో భారీ అక్రమాలు • సమీక్షలకే పరిమితమైన వైద్యశాఖ మంత్రి

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వైద్యరంగంలో 'పాలన' గాడితప్పింది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, అవినీతి, నిధుల లేమితో అస్తవ్యస్తంగా మారింది. డీపీహెచ్, డీఎంఈ, ఎన్‌హెచ్‌ఎం, టీజీఎంఎస్ఐడీసీ.. ఇలా ప్రతీ విభాగంలో వివాదాలు, సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షలకే పరిమితం అవుతున్నారని, విమర్శలు వినిపిస్తున్నాయి.

దవాఖానల నిర్వహణ గాలికి..

గత ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన దవాఖానలు.. నేడు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. గాంధీ దవాఖానలో అనేక విభాగాలకు గత నెల నాలుగు రోజులు నీటి సరఫరా ఆగిపోయింది. వైద్యులు సర్జరీలను వాయిదా వేశారు. బాత్ రూంలకు కూడా తాళాలు వేసిన దుస్థితి. నిలోఫర్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ నెల మొదటివారంలో నీటి సరఫరా లేక రోగులు అవస్థలు పడ్డారు. 50కిపైగా సర్జరీలను వాయిదా వేశారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. సూపర్ స్పెషాలిటీ దవాఖానలతో పాటు జిల్లా దవాఖానల్లోనూ కనీస మౌలిక వసతులు లేక రోగులు అవస్థలు పడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. పాలనాపరంగా ఫైళ్లు పెండింగ్ పడుతున్నాయని, పీకల మీదికి వచ్చిన తర్వాత హడావుడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చివరికి ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ సైతం నెలలపాటు ఆలస్యం అవుతుండటంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు కలకలం సృష్టించాయి.

విచ్చలవిడి అవినీతి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డీపీహెచ్‌ను మార్చింది. రవీందర్ నాయక్‌కు పదవి కట్టబెట్టింది. ఆయన వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో వైద్యశాఖ పరిధిలో వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ సమయంలో డీపీహెచ్ అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. విచారణ జరపాలని సీఎస్, హెల్త్ సెక్రటరీ, విజిలెన్స్, ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్‌తోపాటు డీపీహెచ్‌కు లంచం ఇచ్చానని ఓ నర్సు ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు విచారణ జరిపినా నివేదిక బయటికి రాలేదు. జూలైలో సాధారణ బదిలీల్లో అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. నర్సులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. ఈ ఘటనలో విజిలెన్స్ విచారణ నిర్వహించి.. డీపీహెచ్‌తో పాటు ఏడుగురు అధికారులకు మెమో ఇచ్చారు. కొన్ని నెలలుగా పీహెచ్‌సీలపై పర్యవేక్షణ కొరవడింది. రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలావరకు పనిచేయడం లేదు. కొన్నిచోట్ల డాక్టర్లు, స్టాఫ్ కుమ్మక్కై రికార్డు కాకుండా ట్యాంపరింగ్ చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది.

గోళీలకూ కరువే..

వానకాలం ప్రారంభం నుంచి వైద్యారోగ్య పరిభాషలో 'సీజనల్ వ్యాధుల కాలం' మొదలవుతున్నట్టే లెక్క. అనుభవాలు, అధ్యయనాల నివేదికల ప్రకారం ఏయే వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నదో ముందుగానే అంచనా వేసి, ముందస్తు ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీ. కానీ ఈసారి ప్రధాన దవాఖానల్లో మందుల కొరత వేధించింది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో డ్రగ్ సప్లయర్లు సరఫరా నిలిపివేశారు. కేంద్రం ఎన్‌హెచ్‌ఎం నిధులు మంజూరు చేయలేదని, అందుకే మందులు కొనడం లేదంటూ టీజీఎంఎస్ఐడీసీ వింత సమాధానం ఇచ్చింది.

అడ్మిషన్లలోనూ విఫలం..

ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలోనూ వైద్యశాఖ విఫలమైంది. 'స్థానికత' నిర్ధారణలో శాఖ అసమర్థత కారణంగా తెలంగాణ బిడ్డలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. 'స్థానికత' నిర్ధారించాలని ఇతర యూనివర్సిటీలు, సాంకేతిక విద్యాశాఖ నుంచి సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. కానీ పట్టించుకోలేదు. చివరికి పీకలమీదికి వచ్చిన తర్వాత జూలై 19న తూతూమంత్రంగా జీవో-33 ఇచ్చారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదివిన వారిని మాత్రమే 'స్థానికులు'గా గుర్తిస్తామని పేర్కొన్నది. దీంతో ఇతర రాష్ట్రాల్లోని మంచి విద్యాసంస్థల్లో చదివిన వారు, ఉద్యోగరీత్యా తల్లిదండ్రుల బదిలీలు, ఇతర కారణాల వల్ల ఇంటర్ వేరే రాష్ట్రంలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారిపోయారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో 53 పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. చివరికి పిటిషనర్లకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇప్పటికీ స్థానికతను నిర్ధారించేందుకు తెలంగాణ వైద్యశాఖ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం.

ఉన్నతాధికారుల మధ్య వివాదాలు..

అసలే పాలనలో వైఫల్యాలు వెంటాడుతుంటే.. ఉన్నతాధికారుల మధ్య విభేదాలు మరో తలనొప్పిగా మారాయి. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, డీపీహెచ్ రవీందర్ నాయక్ మధ్య విభేదాలు ఉన్నాయని చర్చ జరుగుతున్నది. ఓసారి మంత్రి దామోదర దగ్గరికి పంచాయితీ చేరిందని చర్చ జరిగింది. మిగతా అధికారులది కూడా దాదాపు ఇదే పరిస్థితి అని తెలుస్తున్నది.

సమీక్షలకే పరిమితమైన మంత్రి

మంత్రి దామోదర మొదటి నుంచీ వైద్యశాఖపై పెద్దగా ఆసక్తి కనబరచలేదనే విమర్శలు ఉన్నాయి. ఆయనకు బలవంతంగా ఈ శాఖను కట్టబెట్టారని గుసగుసలు వినిపించాయి. దీనికి తగ్గట్టే కొన్ని నెలలపాటు ఆయన శాఖను పెద్దగా పట్టించుకోలేదు. లోక్‌సభ ఎన్నికలు ముగిసే దాకా పెద్దగా సమీక్షలు నిర్వహించలేదు. క్షేత్రస్థాయి పర్యటనలు సరేసరి. అన్ని వైపుల నుంచి విమర్శలు పెరగడం, సీఎం వరకు వ్యవహారం వెళ్లడంతో సమీక్షలు మొదలుపెట్టారని చెప్పుకుంటున్నారు. అప్పటి నుంచి ఆయన సమీక్షలకే పరిమితం అవుతున్నారని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమీక్షలు లోతుగా కూడా జరగడం లేదని అంటున్నారు. తరుచూ దవాఖానలకు వెళ్లి పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుందని కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు అదనంగా మరో రెండు సాధారణ బోగీలు

పెద్దపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఇకపై నాలుగు సాధారణ బోగీలతో నడవనున్నాయి. ప్రస్తుతం ఈ రైళ్లలో కేవలం రెండు సాధారణ బోగీలే ఉన్నాయి. ఇప్పటికే కొన్నింటికి రెండు బోగీల బిగింపు పూర్తి కాగా, డిసెంబర్ నెలాఖరు నాటికి మొత్తం 800 రైళ్లల్లో అదనపు బోగీలు అందుబాటులోకి రానున్నాయి. ప్రయాణికుల వినతులను పరిశీలించిన కేంద్ర రైల్వేశాఖ, రైల్వే బోర్డు అధికారులు దేశవ్యాప్తంగా నడిచే దూరప్రాంతాల రైళ్లన్నింటికీ అదనంగా మరో రెండు బోగీలు జోడించి మొత్తంగా నాలుగు సాధారణ బోగీలతో రైళ్లను నడిపించనున్నారు.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar "X" Roads, Hyderabad-500037 (TS) INDIA.
WALK-IN INTERVIEW
"Walk-in positions for CNC Maintenance Mechanical Engineer; CNC Maintenance Electrical Engineer; Operators:- CNC lathe; CNC Cylindrical grinding; CNC EDM/Wire-Cut; CNC Milling; CNC 5axis; NC Surface grinding; Tool makers; Tool Fitters, PPC/Production Engineer".
Date of Interview : 29th November 2024
Candidates fulfilling the eligibility criteria may step-in for walk-in interview on the date mentioned with latest Resume with photo, original documents & one set self attested photocopies of all educational, experience certificates.
Registration Time: 09:30 A.M. - 12:00 P.M.
For detailed advertisement please visit Citdindia.org website.
Sd/-
PRINCIPAL DIRECTOR